**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**
**ANDHRA PRADESH COMMITTEE**
H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం :

విజయవాడ,
తేదీ : 29 మే, 2018.

# కామ్రేడ్ జక్కా వెంకయ్య మృతికి సంతాపం

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీనియర్ నాయకులు నెల్లూరు జిల్లా ఉద్యమ నిర్మాత కా॥ జక్కా వెంకయ్య మృతిపట్ల సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ప్రఘాడ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తున్నది. ఆయన మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకి తీరని లోటు. వారి ఆశయాలను కొనసాగించి పార్టీ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేసుకోవడమే ఆయనకు పార్టీ అర్పించే నివాళి.

జక్కా వెంకయ్య గారికి 88 సంవత్సరాలు. పిన్న వయస్సులోనే మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల ఆకర్శితులై డా॥ రామచంద్రారెడ్డి, జెట్టి శేషారెడ్డి గార్ల సాహచర్యంతో ప్రజా ఉద్యమాలతో మమేకమై పనిచేశారు. కా॥ సుందరయ్యగారితో అత్యంత సన్నిహిత సంబంధాలు పెట్టుకొని వారి మార్గదర్శకత్వంలో నెల్లూరు జిల్లా ఉద్యమాన్ని పునర్నిర్మించారు. తాను స్వతహాగా భూస్వామ్య కుటుంబంలో పుట్టినా ఆ లక్షణాలన్నింటినీ వదిలేసి కార్మికవర్గ దృక్పథాన్ని అలవర్చుకొని జీవిత చరమాంకం వరకు అదే ఆదర్శాన్ని కొనసాగించారు. ఉద్యమానికోసం ఆస్తిని త్యాగం చేశారు. తన స్వగ్రామమైన దామర మడుగులో వ్యవసాయ కూలీల ఉద్యమాన్ని ప్రారంభించి సమరశీల పోరాటాలతో ఆ గ్రామాన్ని పార్టీకి పెట్టని కోటగా మార్చారు. ఈ క్రమంలో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. పలుమార్లు జైలు శిక్ష అనుభవించారు. 1965, 1975లలో రాజకీయ డిటెన్యూన్‌గా ఒక సంవత్సరం ఐదు నెలలు జైలు జీవితం గడిపారు. నాలుగేళ్ళు కఠినమైన అజ్ఞాత జీవితం గడిపారు. యువతరానికి స్ఫూర్తిగా నిలిచారు. హైస్కూలు వరకే చదువుకున్నా కష్టపడి ఇంగ్లీషు నేర్చుకొని మార్క్సిస్టు సిద్ధాంతాన్ని స్వంత కృషితో అధ్యయనం చేశారు. దాన్ని ఆచరణతో మేళవించడానికి కృషి చేశారు.

జిల్లాలో అతివాద మితవాద చీలికలతో సిపిఐ(యం) బాగా బలహీనపడిన స్థితిలో ఒకరిద్దరి సహాయంతో ఒంటిచేత్తో పార్టీని పునర్నిర్మించారు. నెల్లూరులో కార్మికోద్యమాలను, గ్రామాల్లో వ్యవసాయ కూలీల ఉద్యమాలను అనుసంధానించి కార్మిక కర్షక ఐక్యతకు పాటుపడ్డారు. నవతరంలోకి పార్టీని తీసుకుపోవడానికి విద్యార్థులపై ప్రత్యేకంగా కేంద్రీకరించి వారిని రాజకీయంగా చైతన్యవంతులను చేసి అనేకమందిని పూర్తికాలం కార్యకర్తలుగా తీసుకురావడంలో ఆయన పాత్ర వెలకట్టలేనిది. జిల్లాలోనేగాక రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు విద్యార్థి కార్యకర్తలను పంపించారు. 1970లలో జిల్లాలో కూలి పోరాటాలు, 1980లలో చారిత్రాత్మకమైన భూపోరాటాలకు ఆయన ప్రత్యక్ష సారధ్యం వహించారు. అఖిలపక్ష ఉద్యమం ద్వారా జిల్లాలో అన్ని పార్టీల నాయకులకు పెద్ద దిక్కుగా మారారు.

పార్టీ జిల్లా కార్యదర్శిగా దీర్ఘకాలం పనిచేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా, కేంద్ర కమిటీ సభ్యులుగా కూడా ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్నారు. రెండు సార్లు అల్లూరు శాసన సభ్యునిగానూ, దామరమడుగు గ్రామ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. నియోజకవర్గంలో తన నిస్వార్థ సేవ ద్వారా ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక తయారుజేసి దాన్ని ఒక ఎజెండాగా మార్చగలిగారు. ఇలా రాజకీయ రంగంలో మచ్చలేని మహా నాయకుడిగా, ఆదర్శనేతగా, సిద్ధాంత వేత్తగా, ఆచరణశీలిగా రాష్ట్ర ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచారు. వారి మరణం పార్టీ ప్రజా ఉద్యమాలకు తీరని లోటును మిగిల్చింది. ఆయన మృతికి సిపిఐ(యం) ఘనంగా నివాళులర్పిస్తున్నది. ఆయన మృతికి సంతాప సూచికంగా రాష్ట్ర కార్యాలయంపై అరుణపతాకాన్ని అవనతం చేశాము.

(పెనుమల్లి మధు)
రాష్ట్ర కార్యదర్శి